కొట్టి) బాగుందా? ఎంతందంగా తేలేదో ఫోటోలు!

అ:—అమ్మోయ్! చచ్చాను. బుద్దొచ్చింది.

నై:—పో! నీదిక్కున్నచోట చెప్పుకో!

అ:—(పరుగెడుకుపోయి) అబ్బా! ఎంతపనిజరిగిండి. వీణ్ణితగలెయ్యా! చంపేశాడు. ఇదేకాబోలు Iron love అంటారు కుర్రాళ్ళందరూ— ఇనుపప్రేమ.

---

# విషయలోలత.

వి. వి. యస్. సత్యనారాయణరావుగారు.

Enjoyments are short lived like the flash of lightning in the midst of thick clouds."——"A Poet."

౧

మనోహరుడికి చిన్నప్పటినుండీ చిత్రకళయందు అభిమానం. ప్రపంచ జ్ఞానంకొరకు కొంతవరకు ఆంగ్లవిద్య నభ్యసించాడు. బుద్ధిమంతుడు ధనవంతుడు. తలచిన పనియందు పట్టుదలబూని నిర్వహింపగల సమర్థుడు.

శైశవావస్థయందే మాతృదేవతని గోల్పోవడం చేత అడిగినదెల్ల సమకూర్చి అతిగారాబంగా పెంచాడు మనోహరుడిని జనకుడు. స్కూలుఫైనలు చదువుతూవుండగా ఒక సంపన్న గృహస్థుడికూతురు- సరోజనితో- వివాహమయింది మనోహరుడికి. అనంతరం అభిమానవిద్యయైన చిత్రలేఖనం అభ్యసించడానికై బొంబాయివెళ్లాడు. ఇది ఇప్పటికి నాల్గు సంవత్సరాల క్రితం ముచ్చట.

భూలోక స్వర్గం అనదగ్గ బొంబాయి నగరంలో-అపురూప సౌందర్య శాలినులైన సహాధ్యాయినులతో అనన్య సౌలభ్యాలైన ఆనందాలననుభవించాడు మనోహరుడు. విద్యార్థినీబృందంలో లీల అనే సహాధ్యాయినికీ మనోహరుడికీ మొదటినుండీ ఒకరిపై నొకరికి అనిర్వాచ్యమైన ఒకవిధమగు అభిమానం. ఒకరికొకరు తీసిపోకుండా చిత్రకళ నభ్యసించారు. సాయం సమయం వాయుసేవనార్థం షికారులకు,సినీమాలకు ఎక్కడికి వెళ్లినా ఇరువురూ కలసి వెళ్లేవారు. క్రమక్రమంగా వారి సాంగత్యం ఒకరి నొకరు అరని మునమెడ బాయజాలనంత గాఢంగా పరిణమించింది.

మనోహరుడు బొంబాయివచ్చిన రెండుసంవత్సరాల అనంతరం సరోజని యుక్తవయస్కయైనట్లు జాబువచ్చింది. జవాబుద్వారా తనసంతోషాన్ని వెలిపుచ్చాడు. తండ్రివ్రాసిన లేఖలకు సకాలంలో జవాబులు వ్రాసేవాడు. క్రమంగా మూడవసంవత్సరం గతించింది. తండ్రిఉత్తరాలకు మనోహరుడి జవాబు కొంచెం ఆలస్యం కాజొచ్చింది. రెండు ఉత్తరాల కొకప్రత్యుత్తరం, నాలుగు,ఎనిమిది, నెల, రెండు నెలలు, కడకు నిరుత్తరం అయిపోయింది.

శ్యామసుందరుడూ సరోజనీ బాల్యమిత్రులు. ప్రాథమిక విద్య ఇరువురూ సమంగా అభ్యసించారు. తండ్రికి బదిలీ అవడంచేత రమారమి ఆరుసంవత్సరాల క్రితం శ్యామసుందరుడు రాయ

124

ఘుడ్ వెళ్ళిపోయినాడు. నాటికి నేడుమరల విజయవాడవచ్చి సరోజనిని దర్శించాడు.

సరోజని ఇప్పుడు మునుపటి సరోజనికాదు. నవలావణ్యవతి. విద్యుల్లతా సదృశయైన సరోజనీ శ్యామసుందరుడి వీక్షణమాలికలకి మిరుమిట్లు గొలిపింది. ఆశాపూరితాలైన శ్యామసుందరుడి చంచల దృక్కులు సరోజని దివ్యసుందర విగ్రహంపై పచారు చేశాయి. అతనిదర్శనం నిరాధారయై అల్లాడుచున్న లతకూనకి ఆశ్రయం దొరకినట్లుగా నవనాగరికతా ప్రపంచకంలో, మోడరన్ మన్మధులమధ్య గాలిలో దీపంవలె చలిస్తూయున్న సరోజనిలేతహృదయానికి అమందానందం గొల్పింది. ఇరువురిచూపులూ ఐక్యమయినాయి. ఇరువురి హృదయాలూ మిళితమయినాయి. క్రమంగా పరస్పరభావ ప్రదర్శనమూ, సమ్మోదపూర్వక మయిన సమ్మతమూ కూడా అయినాయి.

3

మధ్యాహ్నం భోజనానంతరం. చిగురాకుల వంటిచేతితో తమ్మలపాకు మడుపులనందిస్తూ ముద్దులుమూటగట్టు మృదుమధురవాక్కులతో-శరత్కాల చంద్రికాసదృశాలైన దరహాస పరంపరలతో మనోహరుడిని ముగ్ధునిగా నొనర్చింది లీల. శృంగార రసాధిదేవతయనదగ్గ లీలయొక్క సౌందర్యామృతాన్ని అనిమిషనేత్రాలతో తనివిదీరగ్రోలుతూ-తనజన్మ-జనకుడు-ధర్మపత్ని- స్వదేశము-తన్ను-తానున్నస్థితిని-సర్వమును మరచి, అనుభవైకవేద్యాలైన ఆనందరసాల నాస్వాదిస్తున్నాడు మనోహరుడు—.

అంతలో బయటినుండి "లీలా" అనుపిలుపు. లీల మెల్లిగావెళ్లి తలుపుతెరిచింది. ఎదుటనొక మనోహరపురుష విగ్రహం. లీల ఆపాదమస్తకమూ ఒక్కమారుగా తళుక్కుమంది. అదివెరపువల్లకలిగినవణకుగాదు. పారవశ్యముతో జనించిన పులకరింత. ఆమె అర్ధముకుళితనేత్రాల్లో ఆనందమయమైన ఒకవిధమగు అపూర్వ తేజం! ఆమె ముఖకమలంలో ఆనందయుతమైన ఒకవిధమగు నూతనవికసనం !!ఆమె హృదయకోశంలో ఆనందరససమ్మిళితమైన ఒకవిధమగు భావపరిపూర్తి !!! ఆనూతనుని ఆగమనం ఆమెకు స్వర్గానందానుసంధాయకమయింది. అతడు లీలకు మనోహరుడికంటె పూర్వపు స్నేహితుడు. కార్యాంతరనిమగ్నుడై దేశాంతరాలకేగి నేటికిమరలి వచ్చాడు.

౪

"అబ్బా, ఎన్నెన్నివిధాల నమ్మించింది! ఎంతగా లాలించింది! అంతా నిష్కల్మషప్రేమ అనుకున్నాను గాని కేవలం క్షణభంగురమైన విషయలోలత్వమని తలపోయడాని కెన్నడైన రవంత అవకాశం కలగజేసిందా? నాప్రాణంపు ప్రాణము-తానే నాకీలోకమునగల సర్వస్వమని నమ్మించిన లీల—ఆమోసకత్తె-నాయెదుటనే-తన పూర్వపుస్నేహితుడట-ఆదుర్మార్గుడితో సయ్యాటలా...? అగును. ఆశ్చర్యమేమి? "కామాతురాణాం నభయం నలజ్జా" అన్నఆర్యోక్తి మిథ్య అవుతుందా? ఇందామెతప్పు లేశమాత్రమయిననూ లేదు. ఈపరాభవం నాకు విధిగా కావలయును. నేనొనర్చిన ఘోరకిల్బిషానికి నిష్కృతి లేదు. నాకు మనఃపూర్వకముగ, తనశరీరమూ, ప్రాణమూ సయితము సమర్పింప సంసిద్ధయై నాతోడిదే లోకమని తలచెడి నాఅర్ధాంగి-అగ్నిసాక్షిగ పెండ్లియాడిన నాధర్మపత్ని-సరోజనినిపీడి, కండ్లుగానక-ప్రియజనకునికూడ మరచి-మోహాంధుడనై వర్తించిననాకు ఈప్రాయశ్చిత్తం అవశ్యం కావలసిందే. ఇప్పుడు సరోజని పదసరోజ

ములపై బడి, నాయపరాధములనున్నించి, నన్ను క్షమించమని వేడుకొనుటయే నాముఖ్యకర్తవ్యం అనుకుంటూ అవనతవదనుడై మెల్లమెల్లగా శ్వశురగృహం సమీపిస్తున్నాడు మనోహరుడు. అంతలో అటువైపునుండి వెడుతూ ఇద్దరుకుర్రవాళ్లు "మొన్న శ్యామసుందరుడితో లేచిపోయిన సరోజిని భర్త ఈయనేరా" అనుకుంటూ సాగిపోయారు. ఆమాట వినుసరికి మనోహరుడి తల గిర్రున తిరిగిపోయింది. శరీరము ఆపాదమస్తకమూ అగ్నిలో వ్రేల్చినట్లయింది. ఆవేడికి హృదయం కంపించింది. మెదడు కరిగిపోయింది. మతిస్థైర్యము తప్పిపోయింది. అక్కడినుండికదలి తెగినగాలిపడగవలె ఎచటికో—ఎందులకో తెలియకుండా వెల్లిపోయాడు మనోహరుడు.

౫

అమావాశ్యరాత్రి. తొమ్మిదిగంటల సమయం. ఊరిబయట ఒక అర్ధశిధిల గృహంలో గుడ్డి దీపపు వెలుగున జీర్ణవసన ధారిణియై శుష్కాంగియై రూపొందిన దైన్యదేవతవలె ఒక చింకచాపపై మేనువాల్చి యుంది సరోజని. అంతలో తప్పతాగి ఎర్రని అగ్నిగోళములవంటి గుడ్లను తేలవేస్తూ వికటాట్టహాస మొనరుస్తూ చరచరలోనికి వచ్చాడు శ్యామసుందరుడు.

శ్యా:—ఏమి, వంటయైనదా ?

స:—ఇంట్లో పిడికెడు నూకలైనను లేవుగదా ! వంట యెట్లుచేయగలను?

శ్యా:—ముష్టియెత్తియైన తెచ్చి వండవలయునని తెలయదా?

స:—అంత సాహసము లేకపోయినది.

శ్యా:—అట్లైన ఈరాత్రి పస్తుండవలసినదేనా ?

స:—నేనేమిచెప్పగలను?

శ్యా:—నీవుచెప్పలేనిచో నాదారినేను చూసుకోగలను. నీగతి నీవుచూసుకో వచ్చును. ఇంతటితో మన యిర్వురికీ సంబంధము వదలిపోయినది. అని రోషారుణితనేత్రుడై వెనుదిరిగి చూడకుండా వెళ్లిపోయాడు శ్యామసుందరుడు. వీధివాకిటివరకు అతనిని వెంబడించి తూలి అరుగుపై పడిపోయింది. సరోజని.

కారుచీకటి జంఝూ మారుతము చిటపట ఆరంభించి క్రమంగా జలప్రళయం వలె కుంభవృష్టి మొదలుపెట్టింది. గుండెల వియ్యజేసే ఉరుములు. మధ్యమధ్య కష్టదశలోని వైరాగ్యంవలె తళుకు తళుకు మను మెరుపులు. అట్టిస్థితిలో బవిరిగడ్డము, జడలుగట్టినజుట్టు, ప్రేతరూపముతో తడిసిముద్దయై వడవడ వణకుతూ వచ్చి ఆయింటిముందు కాలుజారి పడిపోయినాడు మనోహరుడు. అంతలో తళుక్కున ఒక మెరుపు మెరిసింది. ఆవెలుగులో సరోజని అతనిని జూచి, ఎవడో పాంధుడని తలచి, చేయూతనిచ్చి లేవనెత్తి లోనికి గొంపోయి పరుండ బెట్టింది. అతడుకళ్లు సగము తెరచి ఆగుడ్డిదీపపు వెలుగులో ఆమెనుజూచి అస్ఫుటస్వరంతో ఎవరు ?...నీవు...నా సరో...జా ? అని మరల మూసేసుకున్నాడు. ఆమాటలువిని అతడు తనమనోహరుడని గ్రహించి,ఆమె "ఇట్టిప్రేమైక నిధానమును ఇట్టి పవిత్రమూర్తిని గోల్పోయిన ఘోరపాతకిని కుత్సితరాలను చపలచిత్తను ఛీ ! ఇక నాజీవితము నిరర్ధకము అని యనుకొనుచు అతని శిరము తనయొడిలో బెట్టుకొని విచారించుచుండగా ఫెళఫెళారావములతో ఆయింటిగోడలూ,పైకప్పూ కూలి ఆనిర్భాగ్య జీవుల నిరువురనూ తమపాట్ట బెట్టుకున్నాయి. అంతటితో ప్రకృతి మరల ప్రశాంతభావము పూనింది.

126